## నేడు డీఎస్సీ నియామక అభ్యర్థులకు కౌన్సెలింగ్

నస్పూర్/ఆసిఫాబాద్ టౌన్, అక్టోబర్ 14 : డీఎస్సీ 2024లో ఎంపికై నియామక ఉత్తర్వులు అందుకున్న అభ్యర్థులకు ఈ నెల 15న పాఠశాల పోస్టింగ్ సంబంధించిన కౌన్సెలింగ్ ఉంటుందని మంచిర్యాల, కుమ్రం భీం ఆసిఫాబాద్ (ఇన్‌చార్జి)జిల్లా విద్యాశాఖ అధికారి యాదయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన ఉపాధ్యాయ అభ్యర్థులు మంచిర్యాలకు చెందిన వారు కలెక్టరేట్‌లోని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాకు చెందిన వారు జిల్లా కేంద్రంలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో ఉదయం 10 గంటల వరకు హాజరవ్వాలని పేర్కొన్నారు. అభ్యర్థులు రెండు ఫొటోలు, ర్యాంక్ కార్డుతో సకాలంలో తప్పనిసరిగా హాజరు కావాలని తెలిపారు.

## దుర్గామాత శోభాయాత్రలో అపశృతి

మంచిర్యాల అర్బన్, అక్టోబర్ 14 : మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఆదివారం జరిగిన దుర్గామాత నిమజ్జన శోభాయాత్రలో అపశృతి చోటు చేసుకున్నది. ఎస్ఐ సనత్ రెడ్డి సోమవారం తెలిపిన వివరాల ప్రకారం.. సీసీసీ నస్పూర్ ఫ్లడ్ కాలనీకి చెందిన గోమాస నందు (16) రెడ్డి కాలనీలో నిర్వహించిన శోభాయాత్ర తన అక్కతో కలిసి వచ్చాడు. రాత్రి 2 గంటల సమయంలో టాటాఏస్ వాహనంలో ఉన్న జనరేటర్‌ను స్టార్ట్ చేసేందుకు బెల్లంకొండ రాకేశ్‌తో కలిసి నందు ప్రయత్నిస్తున్నాడు. ఈ క్రమంలో మరో యువకుడు గంప సాకేత్ అజాగ్రత్తగా, అతివేగంగా బొలేరో వాహనం నడుపుతూ వారిని ఢీ కొట్టాడు. నందుకు తీవ్ర గాయాలయ్యాయి. మంచిర్యాల జిల్లా ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌కు తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. అక్క గోమాస నవీన రాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. నందు సీసీసీ నస్పూర్ పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లొమా ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. తండ్రి శ్రీనివాస్ చనిపోగా తల్లి చంద్రకళ ఉన్నారు.

## మొక్కుబడిగా ప్రజావాణి

తాండూర్, అక్టోబర్ 14 : తాండూర్ ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ఎంపీడీవో పీ శ్రీనివాస్, డిప్యూటీ తహసీల్దార్ వీవీఆర్‌కేడీ ప్రసాద్ ఆధ్వర్యంలో ప్రజావాణి నిర్వహించారు. ఒకే ఒక దరఖాస్తు వచ్చినట్లు వారు తెలిపారు. కాగా, అధికారులు తరచూ గైర్హాజరవడంతో ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజా సమస్యలు పరిష్కరించడంలో ముందు ఉండాల్సిన అధికారులు విధులకు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి విద్య, ఇంజినీరింగ్, పంచాయతీరాజ్, మిషన్ భగీరథ, ఇరిగేషన్, వెటర్నరీ, విద్యుత్ అధికారులు హాజరు కాలేదు. వరుసగా ప్రజావాణి కార్యక్రమాలకు గైర్హాజరయ్యే అధికారుల తీరుపై ప్రజలు విస్మయం చెందుతున్నారు. తమ సమస్యలను ఎవరికి చెప్పుకోవాలో అర్థంకావడం లేదని వాపోతున్నారు. అధికారులు స్థానికంగా ఉండక విధులు నిర్వహిస్తున్నట్లు ఆరోపిస్తున్నారు. అధికారులు సమయపాలన పాటిస్తూ విధి నిర్వహణకు హాజరయ్యేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ఎంపీడీవో పీ శ్రీనివాస్, డీటీ వీవీఆర్‌కేడీ ప్రసాద్, ఎన్ఆర్ఈజీఎస్ ఈసీ రమేశ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్వరూపారాణి, వైద్యశాఖ సూపర్‌వైజర్ తార హాజరయ్యారు.

## ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ రద్దు చేయాలి

ఆసిఫాబాద్ టౌన్, అక్టోబర్ 14 : డీఎస్సీ నియామకాల్లో పది శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల వల్ల బీసీ అభ్యర్థులకు తీవ్ర అన్యాయం జరిగిందని బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు ఆవిడపు ప్రణయ్ పేర్కొన్నారు. ఫిర్యాదుల విభాగంలో సోమవారం జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారీకి వినతి పత్రం అందజేశారు. ఈడబ్ల్యూఎస్ ద్వారా బీసీ బిడ్డలు ఎంతో మంది ఉద్యోగ నియామకాలకు దూరం కావాల్సిన పరిస్థితి దాపురించిందని, తక్షణమే ఉద్యోగ నియామకాల్లో 10 శాతం రిజర్వేషన్లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జనాభాలో 62 శాతం ఉన్న బీసీలకు 29 శాతం, 6, 2 శాతం ఉన్న ఓసీలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పించడం ఎంతవరకు సమంజసమని ఆవేదన వ్యక్తం చేశారు. రానున్న కాలంలో బీసీలంతా ఐక్యమై ఉద్యమాలకు సిద్ధమవుతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ అధ్యక్షుడు పిప్రే సాయి, బీసీ యువజన సంఘం నాయకుడు బొట్టుపల్లి ప్రశాంత్ పాల్గొన్నారు.

## దుర్గామాత నిమజ్జనం

శ్రీరాంపూర్, అక్టోబర్ 14 : శ్రీరాంపూర్‌లో దుర్గామాత నిమజ్జనోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. నిర్వాహకులు పురవీధుల్లో శోభాయాత్ర న్విహించారు. అనంతరం గోదావరిలో నిమజ్జనం చేశారు. ఆర్కే-6 గుడిసెలు హిమ్మత్‌నగర్‌లోని దుర్గామాత ఉత్సవ కమిటీ అధ్యక్షుడు వనపర్తి రాజేశం ఆధ్వర్యంలో నిర్వహించిన శోభాయాత్రను ఎస్ఐ సంతోష్ ప్రారంభించారు. శ్రీరాంపూర్ కాలనీలోని జై దుర్గామాత మండపం, ఆర్కే-8 కాలనీలోని సాయి దుర్గామాత భక్తమండలి, యువశక్తి యూత్ ఆధ్వర్యంలో, కొత్త రోడ్, శ్రీరాంపూర్ కాలనీ మార్కెట్ సంత మైదానంలో, ఆర్కే-6 కాలనీ, కృష్ణకాలనీలో ఏర్పాటు చేసిన అమ్మవారి ప్రతిమలతో శోభాయాత్ర నిర్వహించారు. కౌన్సిలర్ పూదరి కుమార్, మాజీ సర్పంచ్ గుంట జగ్గయ్య, డాక్టర్ రాజమౌళి, బొడ్డు లచ్చయ్య, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ఉపాధిహామీ పనుల పరిశీలన

కాగజ్‌నగర్, అక్టోబర్ 14 : కాగజ్‌నగర్ మండలం దుర్గానగర్, వల్లకొండ, కోసిని గ్రామాల్లో సోమవారం జాతీయస్థాయి బృందం సభ్యులు ఉపాధి హామీ పనులను పరిశీలించారు. దుర్గానగర్‌లో అమల్ పాల్ రైతు చేనులో చేపల పెంపకం కుంట పనిని పరిశీలించి, అలాగే వివిధ పెన్షన్ లబ్ధిదారులతో దారులతో మాట్లాడారు. మహిళా సంఘ సభ్యులతో రుణం పొందడం, వాటితో ఏ పనులు చేసుకుంటున్నారని అడిగి తెలుసుకున్నారు. వల్లకొండ పంచాయతీలోని లబ్ధిదారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కోసినిలో ఉపాధి హామీ ద్వారా చేపట్టిన సంపద వనాల పని వివరాలపై సంతృప్తి చెందారు. ఎంపీడీవో రమేశ్, ఏపీవో బుచ్చన్న, ఏపీఎం భూమక్క, సాంకేతిక సహాయకులు శ్రావణ్, దేవేంద్ర, రమాదేవి, కార్యదర్శులు గంగాధర్, రజిత, క్షేత్ర సహాయకులు సుమిత్, గురువయ్య, పోశెట్టి పాల్గొన్నారు.

## సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్లకు సన్మానం

శ్రీరాంపూర్, అక్టోబర్ 14 : బదిలీపై వెళ్తున్న శ్రీరాంపూర్ ఏరియా సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్ మురళీమోహన్‌ను, నూతనంగా బదిలీపై వచ్చిన సీనియర్ సెక్యురిటీ ఆఫీసర్ జక్కారెడ్డిని సోమవారం ఉద్యోగులు, అధికారులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. మురళీమోహన్ భూపాలపల్లికి బదిలీపై వెళ్తున్నారు. ఏరియా టింబర్ యార్డు నుంచి బదిలీపై వచ్చిన జక్కారెడ్డి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆస్తుల పరిరక్షణలో సెక్యూరిటీ గార్డుల పాత్ర కీలకమైందన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఇన్‌స్పెక్టర్ పోగుల స్వామి, రామిరెడ్డి, జూనియర్ ఇన్‌స్పెక్టర్ సిర్ర రాజయ్య, జమ్మేదార్ కనకయ్య, రామ్‌చందర్, నాగ మల్లేశం, కళ్యాణ్, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా, పిట్ కార్యదర్శి మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

## జడ్జిని కలిసిన న్యాయవాదులు

మంచిర్యాల అర్బన్, అక్టోబర్ 14 : మంచిర్యాల జిల్లా ప్రధాన న్యాయమూర్తి బోయ శ్రీనివాసులును జిల్లా బార్ అసోసియేషన్ సభ్యులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం విజయదశమి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బండవరపు జగన్, న్యాయవాదులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులకు సన్మానం

దండేపల్లి, అక్టోబర్ 14 : దండేపల్లి మండలం కొర్విచెల్మ గ్రామంలో ఇటీవల నూతనంగా ఎంపికైన సెకండరీ గ్రేడ్ టీచర్లు రాందేని వినోద్‌కుమార్, బీస అనూష, సామ సుప్రియను జీపీ కార్యాలయంలో సోమవారం రెబల్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సన్మానించారు. గ్రామం నుం చి ముగ్గురు ఉపాధ్యాయులుగా ఎంపిక కావడంపై హర్షం వ్యక్తం చేశారు. రెబల్ యూత్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు, గ్రామస్తులు ఉన్నారు.

**సేవాలాల్ సేన ఆధ్వర్యంలో..**

కెరమెరి, అక్టోబర్ 14 : మండలంలోని బొగడగూడకు చెందిన రాథోడ్ నరేశ్, రాథోడ్ మహేశ్, రాథోడ్ సువర డీఎస్సీ ఫలితాల్లో ఉపాధ్యాయులుగా ఎంపికవగా, సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు రాథోడ్ రూప్‌లాల్ సోమవారం సన్మానించారు. ఈ కార్యక్రమంలో సేవాలాల్ సేన సభ్యులు బాదావత్ పిరాజీ, జాటోత్ రవీందర్, రాథోడ్ సంతోష్, గ్రామ పెద్దలు రాథోడ్ తుల్సీరాం, రాథోడ్ తిరుపతి, రాథోడ్ వెంకట్‌రాం పాల్గొన్నారు.

# గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి చర్యలు

- మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్
- అధికారులతో పనులపై సమావేశం

నస్పూర్ : సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

నస్పూర్, అక్టోబర్ 14 : గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. కలెక్టర్ సమావేశ మందిరంలో సోమవారం సెంటర్ ఫర్ రూరల్ మేనేజ్‌మెంట్ నేషనల్ లెవల్ మానిటర్స్ సభ్యులు బాల మురళి, సునీల్, డీఆర్డీవో కిషన్, జిల్లా వయోజన విద్యాధికారి పురుషోత్తంనాయక్‌తో కలిసి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. 250 మంది జనాభా కంటే అధికంగా ఉన్న గ్రామాల నుంచి మండల కేంద్రానికి అనుసంధానమయ్యే బీటీ రోడ్లు, మరమ్మతు వివరాలతో నిబంధనలకు లోబడి నివేదిక అందించాలని ఆదేశించారు. పింఛన్, భూగర్భ జల, వంతెనలు, సెగ్రిగేషన్ షెడ్లతో పాటు, కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఇతర ప్రజా ప్రయోజనకర పనులను వేగవంతం చేయాలని సూచించారు. సెంటర్ ఫర్ రూరల్ మేనేజ్‌మెంట్ నేషనల్ లెవల్ మానిటర్స్ సభ్యులు 15 నుంచి 19వ తేదీ వరకు జిల్లాలోని 4 మండలాల్లో ఎంపిక చేసిన 10 గ్రామపంచాయతీల్లో పర్యటిస్తారని తెలిపారు. గ్రామాల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులను పరిశీలిస్తారని, వాటి వివరాలను తెలుసుకుంటారని పేర్కొన్నారు. మానిటర్స్ సభ్యులు గ్రామాల్లో పర్యటించే సమాచారాన్ని ఆయా గ్రామాల్లో కొనసాగుతున్న పనుల పురోగతి వివరాలను ఫొటోగ్రాఫ్‌తో కలిసి కేంద్రానికి సమర్పించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

**పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి**

కాసిపేట, అక్టోబర్ 14 : తాజా మాజీ సర్పంచుల కాలంలో పని చేసిన పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు సపాట్ శంకర్ కోరారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్ కుమార్ దీపక్‌కు కాసిపేట మండలం సోమగూడెం(కే) తాజా మాజీ సర్పంచ్, సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు సపాట్ శంకర్ వినతిపత్రం అందించారు. 311 జీపీల్లో గతంలో చేసిన అభివృద్ధి పనుల పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని కోరారు.

**పీసా గ్రామ సభలతోనే ఎంపిక చేయాలి**

కాసిపేట, అక్టోబర్ 14 : పీసా గ్రామ సభల ద్వారానే ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులను ఎంపిక చేయాలని ఆదివాసీ సేన కాసిపేట మండలాధ్యక్షుడు మడావి వెంకటేశ్, వర్కింగ్ ప్రెసిడెంట్ పెంద్రం శంకర్ కోరారు. ఈ మేరకు ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. అలాగే కాసిపేట ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీవో సఫ్దర్ అలీకి వినతి పత్రం అందించారు. 5వ షెడ్యూల్ ప్రాంత పరిధిలో ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలు విషయంలో పీసా చట్టం నిబంధనలు పాటించకుండా జారీ చేసిన జీవో 33ను ఏజెన్సీ ప్రాంతంలో నిలిపివేయాలని, నిబంధనల ప్రకారం లబ్ధిదారుల ఎంపిక పీసా గ్రామ సభల ద్వారా జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

# భూ తగాదా కేసులో ఒకరి అరెస్ట్

- వివరాలు వెల్లడించిన మంచిర్యాల ఏసీపీ ప్రకాశ్
- ఆయా చోట్ల చోటు చేసుకున్న ఘటనల్లో పలువురిపై కేసు.., రిమాండ్

మంచిర్యాల అర్బన్ : వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ ప్రకాశ్

మంచిర్యాల అర్బన్, అక్టోబర్ 14 : భూతగాదా కేసులో పెద్దపల్లి జిల్లా మంథని మండలం గుంజపడుగు గ్రామానికి చెందిన కుంట శ్రీనివాస్ అలియాస్ శ్రీనును అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించినట్లు మంచిర్యాల ఏసీపీ రత్నపురం ప్రకాశ్ తెలిపారు. ఏసీపీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో కేసుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. జైపూర్ మండలం రసూల్‌పల్లికి చెందిన కోమటి సత్తయ్య, మంచిర్యాలలోని హమాలీవాడకు చెందిన సోంశెట్టి సంపత్‌తో కలిసి సుల్తానాబాద్ మండలం కనుకుల గ్రామానికి చెందిన పోతిరెడ్డి సుధాకర్ రెడ్డి 10 ఏళ్ల క్రితం గర్మిళ్ల శివారులోని సర్వే నంబర్ 180/1లో తలో వెయ్యి గజాల చొప్పున స్థలం కొనుగోలు చేశారు. చుట్టూ సిమెంట్ ప్లేట్ ఫెన్సింగ్ వేసుకున్నారు. గత నెలలో కుంట శ్రీనివాస్ సిమెంట్ ప్లేట్లను ధ్వంసం చేసి ముగ్గురికి సంబంధించిన స్థలాన్ని ఆక్రమించుకున్నాడు. ఆ ముగ్గురూ మంచిర్యాల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో శ్రీనివాస్‌పై మూడు కేసులు నమోదు చేశారు. అయినా తన పద్ధతి మార్చుకోలేదు. వారం క్రితం భూమి ఆక్రమించుకునేందుకు భూమిని కొలిచాడు. ఆ ముగ్గురిలో సుధాకర్ రెడ్డి పలుకుబడిన వ్యక్తిగా ఉండడంతో అతని అడ్డు తొలగిస్తే మిగతా ఇద్దరిని బెదిరించి, స్థలాన్ని కబ్జా చేసుకోవచ్చనే ప్లాన్ చేసుకున్నాడు. ఈ క్రమంలో 10వ తేదీన ముగ్గురూ స్థలం వద్దకు వెళ్లారు. విషయం తెలుసుకున్న శ్రీనివాస్ తల్వార్‌తో సుధాకర్‌రెడ్డిపై దాడి చేశాడు. దీంతో ముగ్గురూ పారిపోయారు. అదే రోజు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సోమవారం కుంట శ్రీను మంచిర్యాల అమరావది ఏరియాలో ఉన్నాడన్న సమాచారం మేరకు పోలీసులు అరెస్ట్ చేశారు. అతనిని విచారించగా 2013లో గర్మిళ్ల శివారులో ఎకరం భూమి కొనుగోలు చేసినట్లు, అక్కడ భూమి విలువ పెరగడంతో తన పక్కన ఉన్న సుధాకర్ రెడ్డి భూమి కబ్జా చేయాలనే ఉద్దేశంతో వారిపై దాడి చేసినట్లు ఒప్పుకున్నాడు. శ్రీనివాస్ గతంలో గట్టు వామన్‌రావు దంపతులను హత్య చేసిన ఘటనలో ఏ1 నిందుతుడిగా ఉన్నట్లు, ఇతనిపై ఇప్పటి వరకు 5 కేసులు నమోదైనట్లు ఏసీపీ వెల్లడించారు. ఈ మేరకు శ్రీనివాస్ వద్ద నుంచి తల్వార్‌ను స్వాధీనం చేసుకొని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ బన్సీలాల్, ఎస్ఐ సురేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

**దాడికి పాల్పడిన వారిపై..**

జిల్లా కేంద్రంలోని అశోక్ రోడ్డులో దుర్గాదేవి శోభాయాత్రలో ఓ కుటుంబంపై దాడికి పాల్పడిన అబ్దుల్ అఫ్రోజ్, బిట్టు, రాజుతో పాటు, మరికొందరిపై కేసు నమోదు చేససినట్లు సీఐ బనీసలాల్ తెలిపారు. ఆదివారం అర్ధరాత్రి సమయంలో డీజే సౌండ్‌తో వెళ్తున్న వాహనాన్ని చింతపండు రాజేశం ఇంటి ఎదుట నిలుపగా, సౌండ్ ఎక్కువ రావడంతో అతని కొడుకు శిరీశ్ బయటకు వచ్చి, వవాహనాన్ని ముందుకు తీసుళ్లాలని కోరారు. ఆగ్రహానికి గురైన ఆ యువకులు శిరీశ్‌పై దాడి చేశారు. అడ్డుకోబోయిన తల్లి తండ్రులు, స్నేహితులపై దాడికిదిగారు. సోమవారం మంచిర్యాల పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని, కేసు నమోదుచేసినట్లు సీఐ తెలిపారు.

**ఇరువర్గాలపై కేసు..**

దండేపల్లి, అక్టోబర్ 14 : దండేపల్లి మండలం గూడెంలో దసరా పండుగ రోజు ఇరు వర్గాలు దాడి చేసుకోగా, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఉదయ్‌కిరణ్ తెలిపారు. ఇరువర్గాలకు చెందిన ఏడుగురితో పాటు, మరి కొందరిపై కేసులు నమోదు చేశామని పేర్కొన్నారు. ఆదివారం ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నామన్నారు.

**గోలేటిలో ముగ్గురిపై..**

రెబ్బెన, అక్టోబర్ 14 : రెబ్బెన మండలం గోలేటిలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్‌పై దాడిచేసిన ముగ్గుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. ఆదివారం రాత్రి ఉపేందర్ ఇంటికి వెళ్లిన ముగ్గురు.. బయటకు రావాలని కోరారు. రాకపోవడంతో ఆయనపై దాడిచేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

**నెన్నెలలో ఇద్దరిపై..**

నెన్నెల, అక్టోబర్ 14 : కల్లు తాగి వాంతి చేసుకున్న గొల్లపల్లి గ్రామానికి చెందిన పొన్నాల వెంకటస్వామిపై కులంపేరుతో తిట్టి, దాడిచేసిన అదే గ్రామానికి చెందిన వేల్పుల రాజం, అతని కొడుకు సురేశ్‌పై కేసు నమోదు చేసినటుల ఎస్ఐ ప్రసాద్ తెలిపారు. వెంకటస్వామి సోమవారం ఉదయం ఈత కల్లు తాగి వచ్చి, గ్రామంలోని చింతచెట్టు కింద కూర్చున్నాడు. అక్కడే వాంతిచేసుకున్నాడు. గమనించిన రాజం.. తన భూమిలో వాంతి చేసుకుంటావా అంటూ ముఖంపై ఉమమేమసి, కులం పేరుతో తిట్టాడు. కర్రతో దాడిచేశాడు. తప్పించుకున్న వెంకటస్వామి విషయాన్ని కుటుంబ సభ్యులు, కుల పెద్దలకు చెప్పాడు. వారు సంఘటనా స్థలానికి రాగా, వారిపైనా రాజం, తన కొడుకు సురేశ్ తిట్టారు. దీంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

**కాగజ్‌నగర్‌లో 14 మంది రిమాండ్..**

కాగజ్‌నగర్, అక్టోబర్ 14 : కాగజ్‌నగర్‌లోని ఈఎస్ఐ వాటర్ ట్యాంక్ సమీంలో, ప్రధా మార్కెట్ ఫ్లైఓవర్ బ్రిడ్జి సమీపంలోని జ్యూస్ సెంటర్ వద్ద జరిగిన గొడవలో 14 మందిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్టు డీఎస్పీ రామానుజం వెల్లడించారు. మరికొందరిని త్వరలోనే అదుపులోకి తీసుకుంటామని తెలిపారు. పట్టణ ప్రజల శ్రేయస్సు కోసం, శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా పోలీసులు అహర్నిశలు శ్రమిస్తున్నారని, సమస్యలు, గొడవలు చెలరేగినా ముందుగ పోలీసులకు సమాచారం అందజేయాలన్నారు.

## కేంద్ర మంత్రికి విశ్రాంత ఉద్యోగుల వినతి

శ్రీరాంపూర్, అక్టోబర్ 14 : 27 ఏళ్లుగా కోల్ మైన్స్ రిటైర్డ్ కార్మికుల పింఛన్ పెరగలేదని, సమస్యలు పరిష్కరించాలని కోల్ పెన్షనర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మారెపల్లి బాబురావు, కార్యదర్శి సారంగా చారి, ఎస్ ప్రభాకర్, చంద్రశేఖర్ కోరారు. ఈ మేరకు కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డికి సోమవారం వినతి పత్రం అందించారు. పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

## గౌడ సంఘం ఆధ్వర్యంలో సన్మానం

దండేపల్లి(జన్నారం), అక్టోబర్ 14 : జన్నారం మండలం పొనకల్‌కు చెందిన గౌడ కులస్తులు గొల్లపెల్లి సుభాష్, వాణి కూతురు వైష్ణవి ఎంబీబీఎస్‌లో సీటు సాధించగా, ఆమెను గౌడ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షుడు పొడేటి సతీశ్‌గౌడ్, మండలాధ్యక్షుడు మూల భాస్కర్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, నర్సాగౌడ్, రమేశ్‌గౌడ్, లింగన్నగౌడ్, సతీశ్, వెంకటేశ్వర్, శంకర్, కిరణ్, సత్యాగౌడ్ తదితరులున్నారు.

## ఒకరి ఆత్మహత్య

కన్నెపల్లి, అక్టోబర్ 14 : కన్నెపల్లి మండల కేంద్రంలో భీమినికి చెందిన జంగపల్లి రాకేశ్(35) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు కన్నెపల్లి ఎస్ఐ గంగారాం తెలిపారు. రాకేష్‌కు 10 ఏళ్ల క్రితం కన్నెపల్లికి చెందిన గౌరుతో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కొడుకులు ఉన్నారు. ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్న రాకేష్ కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. భార్యను కొడుతూ తిడుతూ వేధించడంతో 10 రోజుల క్రితం కన్నెపల్లిలోని తల్లిగారింటికి వచ్చింది. ఆదివారం వారి ఇంటికి వెళ్లి, భార్యను ఇంటికి రావాలని కోరాడు. తను రాబోనని చెప్పడంతో సాయంత్రం కన్నెపల్లిలోని వైన్‌షాపు పక్కన తాగిన మైకంలో పురుగుల మందు తాగాడు. చుట్టు పక్కల వారు గమనించి, బెల్లంపల్లి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. రాకేష్ అన్నయ్య చంద్రయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

**చికిత్స పొందుతూ ఒకరు..**

జైపూర్, అక్టోబర్ 14 : ఇందారం గ్రామానికి చెందిన సెంట్రింగ్ కూలి బబ్బెర పున్నం (32) ఈ నెల 11న పురుగుల మందు తాగగా, సోమవారం హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ మృతి చెందాడు. భార్యాభర్తలు గొడవపడగా, పున్నం పురుగులమందు తాగాడు. కుటుంబ సభ్యులు మంచిర్యాల ప్రభుత్వ దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌కు తసుకెళ్లారు. అక్కడ సోమవారం మృతిచెందాడు. పున్నంకు భార్య, ఇద్దరు కొడుకులు ఉన్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

సీసీసీ నస్పూర్, అక్టోబర్ 14: నస్పూర్‌లో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మందపల్లి మునీందర్(56) అక్కడికక్కడే మృతిచెందాడు. సోమవారం సాయంత్రం పనిపై వచ్చిన మునీందర్.. ఫ్లడ్‌కాలనీకి వెళ్లే దారిలో రోడ్డు దాటుతుండగా, శ్రీరాంపూర్ వైపు నుంచి మంచిర్యాలకు వెళ్తున్న లారీ ఢీకొట్టింది. తీవ్ర గాయాలై, అక్కడికక్కడే మృతిచెందాడు. లారీ డ్రైవర్ వాహనాన్ని అక్కడే నిలిపి, పరారయ్యాడు. దీంతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. ఎస్ఐ నెల్కి సుగుణాకర్ ఘటనా స్థలానికి చేరుకొని, పరిశీలించారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చేశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మంచిర్యాల ప్రభుత్వ దవాఖాకు తరలించారు. మునీందర్‌కు భార్య హేమలత, కూతురు దీప్తి ఉన్నారు. మునీందర్ నస్పూర్ గేట్ వద్ద సెలూన్ షాపు నడిపిస్తున్నాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మంచిర్యాల అర్బన్, అక్టోబర్ 14 : మంచిర్యాల జిల్లా కేంద్రంలోని మజీద్‌వాడకు చెందిన నాంపల్లి బాపు(46) ఆదివారం రాత్రి రైల్వే ఫ్లై ఓవర్ సమీపంలో గుర్తు తెలియని రైలు ఢీకొని మృతిచెందినట్లు జీఆర్పీ ఎస్ఐ మహేందర్ తెలిపారు. నాంపల్లి బాపు రెండేళ్ల క్రితం బతుకుదెరువు కోసం పెంచికల్‌పేట మండలం నుంచి మంచిర్యాలకు వలస వచ్చాడు. ఆదివారం రాత్రి ఇరువైపులా చూసుకోకుండా పట్టాలు దాటే క్రమంలో ప్రమాదం జరిగింది. బాపునకు భార్య లక్ష్మి, కొడుకు, కుతురు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## మిత్రుడి జ్ఞాపకార్థం బస్‌షెల్టర్

లక్షెట్టిపేట,అక్టోబర్ 14 : మండలంలోని వెంకట్రావుపేట గ్రామానికి చెందిన బోడకుంట మహేశ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా, అతడి మిత్రులు తన గుర్తుగా గ్రామానికి వచ్చి పోయే ప్రయాణికుల కోసం స్టేజీ ఎక్స్ రోడ్డు వద్ద బస్‌సెల్టర్ ఏర్పాటు చేశారు. మహేశ్ తల్లిదండ్రులతో సోమవారం ప్రారంభించారు. పలువురు గ్రామస్తులు యువకులను అభినందించారు.

## కార్మికుడి మృతిపై సంతాపం

కాసిపేట, అక్టోబర్ 14 : మందమర్రి ఏరియాలోని కాసిపేట-2 ఇంక్లైన్ గనికి చెందిన కార్మికుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సంతాపం తెలిపారు. కోల్ కట్టర్‌గా విధులు నిర్వహిస్తున్న కంశెట్టి కిరణ్ కుమార్ ఆదివారం బెల్లంపల్లి ఫ్లైఓవర్‌పై రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. వారి కుటుంబాన్ని పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేశ్, పిట్ కార్యదర్శి గొల్ల శ్రీనివాస్, బోనగిరి రవి, శంకర్, బాపు పాల్గొన్నారు.

## పాఠశాల భవన పనుల అడ్డగింత

జైపూర్, అక్టోబర్ 14 : గంగిపెల్లిలో నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వ పాఠశాల భవనాన్ని స్థానిక మహిళలు శీలం ముత్తక్క, సుశీల సోమవారం అడ్డుకున్నారు. పాత పాఠశాల భవనం శిథిలమవడంతో ప్రభుత్వం నూతన భవన నిర్మాణానికి రూ.50 లక్షలు మంజూరు చేసింది. ప్రజాప్రతినిధులు పనులను ప్రారంభించారు. కాగా, ఆ స్థలం తమ కుటుంబానికి చెందినదని సదరు మహిళలు పేర్కొన్నారు. ప్రభుత్వ స్థలంలో పనులు చేపడుతుండగా మహిళలు అడ్డుకోవడంపై తాజా మాజీ సర్పంచ్ లింగారెడ్డి రెవెన్యూ, పోలీసు అధికారులకు ఫిర్యాదు చేశాడు.

## సమాజ సేవలో భాగస్వాములవ్వాలి

దండేపల్లి, అక్టోబర్ 14 : మున్నూరుకాపు ఉద్యోగ, విశ్రాంత ఉద్యోగులు సమాజ సేవలో భాగస్వాములవ్వాలని సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు బొలిశెట్టి రాజన్న, పోలంపెల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. దండేపల్లి మండల కేంద్రంలో సోమవారం సంఘ సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. నిరుద్యోగ యువత, విద్యార్థులకు చేయూతనివ్వాలన్నారు. అనంతరం ఇటీవల ఉద్యోగోన్నతి పొందిన పలువురు ఉద్యోగులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ బొలిశెట్టి బుచ్చన్న, అన్నం సత్యనారాయణ, అప్పాల మనోహర్, కుంచె కిషన్, గుర్రం గంగన్న, గాండ్ల సత్యనారాయణ, కొండు జనార్దన్ తదితరులు ఉన్నారు.

## పేదలకు అండగా ప్రభుత్వం

లక్షెట్టిపేట, అక్టోబర్ 14 : రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలకు ఎల్లవేళలా ఉంటుందని మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేంసాగర్ రావు పేర్కొన్నారు. మున్సిపాలిటీలోని ఊత్కూర్‌కు చెందిన అశ్విని కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నది. వైద్యానికి డబ్బులేకపోవడంతో ఎల్‌వోసీ మంజూరు చేయశా రు. సోమవారం తన నివాసంలో అశ్విని కుటుంబ సభ్యులకు అందజేశారు.

## చర్యలు తీసుకోవాలి

ఆసిఫాబాద్ టౌన్, అక్టోబర్ 14 : ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్‌పై దాడికి పాల్పడిన బీఆర్ఎస్ పార్టీ రెబ్బెన మండలాల అధ్యక్షుడు పోటు శ్రీధర్ రెడ్డి, అతని అనుచనులపై చర్యలు తీసుకోవాలని జిల్లా అధ్యక్షుడు టీ దివాకర్ గౌడ్ కోరారు. ఈ మేరకు ఎస్పీ, కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. రెబ్బెన మండలం గోలేటి గ్రామంలో అవినీతి, అక్రమాలపై ప్రశ్నించినందుకు ఉపేందర్‌పై ఆదివారం రాత్రి శ్రీధర్ రెడ్డి, అతని అనుచరులు పంబలా శ్రీనివాస్, పరికిపండ్ల సత్యనారాయణ హత్యాయత్నానికి పాల్పడ్డారని పేర్కొన్నారు. ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు పిడుగు శంకర్, చిరవంజీవి, మోహన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## 19న జిల్లాస్థాయి కరాటే పోటీలు

బెల్లంపల్లి, అక్టోబర్ 14 : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-19 ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాస్థాయి పోటీలు నస్పూర్ ప్రెస్‌క్లబ్‌లో 19న నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి బాబురావు, జిల్లా కరాటే అసోసియేషన్ కార్యదర్శి ఎనగందుల వెంకటేశ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలకు ఇంటర్మీడియట్ చదువుతూ 19 ఏండ్లలోపు గల విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. బోనఫైడ్, ఆధార్‌కార్డుతో విద్యార్థులు సంప్రదించాలని సూచించారు. ఆసక్తి గలవారు అదే రోజు ఉదయం 9 గంటలకు ఎనగందుల వెంకటేశ్ 98663 53912 నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

## నేటి నుంచి క్రీడాపోటీలు

హాజీపూర్, అక్టోబర్ 14 : మండలంలోని గుడిపేటలో గల 13వ ప్రత్యేక తెలంగాణ పోలీస్ బెటాలియన్‌లో విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బందికి మంగళవారం నుంచి నాలుగు రోజుల పాటు క్రీడలు నిర్వహిస్తున్నట్లు బెటాలియన్ కమాండెంట్ వెంకట్రాములు సోమవారం తెలిపారు. ఉదయం 7:30 నిమిషాలకు పోటీలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. 100 మీటర్లు, 400 మీటర్ల పరుగు పందెం, లాంగ్ జంప్, హైజంప్, షార్ట్ పుట్, డిస్కస్‌త్రో, షటిల్, బ్యాడ్మింటన్, టెన్నిస్ కాయిట్, క్యారమ్స్, చెస్, కబడ్డీ, వాలీబాల్, క్రికెట్‌తో పాటు టగ్ ఆఫ్ వార్ పోటీలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కౌటాల, అక్టోబర్ 14 : గుండాయిపేట 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో బూస్టర్ పీటీఆర్ మార్పు, ఇతర మరమ్మతుల కారణంగా కౌటాల 33/11 కేవీ, రవీంద్రనగర్ 33/11 కేవీ సబ్‌స్టేషన్ల పరిధిలోని అన్ని గ్రామాలకు మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ రవీందర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ ఉంటదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

నస్పూర్, అక్టోబర్ 14 : విద్యార్థుల ఫీజురీయింబర్స్‌మెంట్‌ను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని తెలంగాణ విద్యార్థి ఉద్యమవేదిక రాష్ట్ర కార్యదర్శి చిప్పకుర్తి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంచిర్యాలలోని సంఘం కార్యాయలంలో సోమవారం ఆయన మాట్లాడారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడంతో పేద విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు ధ్రువీకరణ పత్రాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నాయని పేర్కొన్నారు. విడుదల చేయకపోతే కళాశాలలు తెరవబోమని డిగ్రీ, పీజీ కళాశాలలు అల్టిమేటం జారీ చేశాయన్నారు.

## డిగ్రీ కళాశాలల బంద్

నస్పూర్, అక్టోబర్ 14 : ప్రభుత్వం ఫీజురీయింబర్స్‌మెంట్ సమస్యను పరిష్కరించకపోవడంతో ప్రైవేటు డిగ్రీ కళాశాలల నిరవధిక బంద్ కొనసాగిస్తున్నట్లు ఆ సంఘం నాయకులు పేర్కొన్నారు. వివేకవర్ధిని డిగ్రీ కళాశాలలో సోమవారం నిర్వహించిన సమావేశంలో నాయకులు మాట్లాడారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లినా పరిష్కరించకపోవడంతో శాంతియుతంగా నిరసన కార్యక్రమాలు చేపట్టేందుకు నిర్ణయించామన్నారు. వెంటనే ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని కోరారు.

## సద్వినియోగం చేసుకోవాలి

వాంకిడి, అక్టోబర్ 14 : గ్రామీణ బ్యాంక్ ద్వారా అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆసిఫాబాద్ చీఫ్ మేనేజర్ విశ్వనాథ్ అన్నారు. మండల కేంద్రంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఆవరణలో సోమవారం శాఖ మేనేజర్ కృష్ణ అధ్యక్షతన సేవలపై ఖాతాదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గ్రామీణ బ్యాంక్ సిబ్బంది, ఖాతాదారులు, ప్రజలు, డ్వాక్రా గ్రూప్ మహిళా సభ్యులు, సీసీలు తదితరులు ఉన్నారు.

## బాధితురాలికి పర్సు అప్పగింత

మంచిర్యాల అర్బన్, అక్టోబర్ 14 : మంచిర్యాల పట్టణంలో బస్టాండ్ ఏరియాలోని ఓ హోటల్‌లో సోమవారం హాజీపూర్ మండలం టీకన్నపల్లెకు చెందిన పన్యాల అనూష తన పర్సును పోగొట్టుకున్నది. సంబంధిత హోటల్ యజమాని సాయంతో బ్లూకోల్ట్ సిబ్బంది పర్సును గుర్తించి, పట్టణ సీఐ బన్సీలాల్ సమక్షంలో సదరు మహిళకు అప్పగించారు. ఆ పర్సులో రూ.10 వేలు ఉన్నట్లు తెలిపారు. బ్లూకోల్ట్ సిబ్బంది లక్ష్మణ్, రాజ్‌కుమార్‌ను సీఐ అభినందించారు.

## అంబేద్కర్ మార్గం అనుసరణీయం

వాంకిడి, అక్టోబర్ 14 : అంబేద్కర్ చూపిన మార్గం ప్రతి ఒక్కరికీ అనుసరణీయమని ఖమాన గ్రామ బౌద్ధ సమాజ్ అధ్యక్షుడు జాడి శేఖర్, ఉపాసకులు ఏవో జాడి మిలింద్ కుమార్ పేర్కొన్నారు. ధమ్మచక్ర పరివర్తన్ దివస్ పురస్కరించుకొని సోమవారం ఖమానలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు తిరుపతి, ఉపాసకులు కిషన్, మారుతి, శంకర్, మహిళా మండలి బౌద్ధ సమాజ్ సభ్యులు పాల్గొన్నారు.

## వ్యాపారులపై చర్యలు తీసుకోవాలి

బెల్లంపల్లి, అక్టోబర్ 14 : నూతన అంబేద్కర్ భవన్ స్థలంలో ఇసుక, కంకర వ్యాపారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ దళిత సంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడు కుంభాల రాజేశ్, ప్రధాన కార్యదర్శి రత్నం ఐలయ్య కోరారు. ఈ మేరకు సోమవారం ఐక్యవేదిక ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌కు వినతిపత్రం సమర్పించారు. ఉపాధ్యక్షుడు కుశ్నపల్లి రాజలింగు, కార్యదర్శి గొడిసెల రాజమౌళి, ప్రచార కార్యదర్శులు గోగర్ల శేఖర్, జంజర్ల రవిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

## డ్రైనేజీలో పడి ఒకరి మృతి

మందమర్రి, అక్టోబర్ 14 : మందమర్రి మున్సిపాలిటీ పరిధిలోని భాగ్యనగర్ కాలనీకి చెందిన మార్త కుమారస్వామి(50) మురుగు కాలువలో పడి మృతి చెందినట్లు ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు. తాపీమేస్త్రీ కూలీగా పని చేసే కుమారస్వామి దసరా పండుగ కావడంతో అతిగా మద్యం తాగాడు. ఈ క్రమంలో ఇంటి ఎదుట గల గద్దెపై కూర్చున్న ఆయన, మురుగు కాలువలో పడిపోయాడు. సోమవారం ఉదయం స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. సీఐ శశీధర్ రెడ్డి పరిశీలించి, వివరాలు సేకరించారు. అనంతరం మృత దేహాన్ని మంచిర్యాల ప్రభుత్వ దవాఖానకు తరలించారు. భార్య, కొడుకు, కూతురు స్థానికంగా లేకపోవడంతో ఫిర్యాదు అందలేదని, ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు. ఫిర్యాదు అనంతరం కేసు దర్యాప్తు చేపడతామని చెప్పారు.

## దరఖాస్తుల స్వీకరణ

మందమర్రి రూరల్, అక్టోబర్ 14 : మండలంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో టాటా కంపెనీ సౌజన్యంతో అడ్వాన్స్డ్ టెక్నాలజీ కోర్సుల ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ దేవానంద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు 19వ తేదీలోగా https: iti.telangana.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 7013846573, 9154549697, 98859 81959 నంబర్లను సంప్రదించాలని కోరారు.